క్లుప్తంగా

మానసదేవి ఆలయంలో కిలివేటి ప్రత్యేక పూజలు



ప్రత్యేక పూజల్లో సంజీవయ్య, చైర్ పర్సన్ దీపిక దంపతులు

నాయుడుపేటటౌన్: పట్టణంలోని అగ్రహారపేటలో వెలసిన మానసదేవి (నాగమాసలమ్మ) ఆలయంలో సోమవారం సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య ప్రత్యేక పూజలు చేశారు. అమ్మవారికి అభిషేకాలు జరిపి పూజలు చేశారు. సంజీవయ్యతోపాటు మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, బాలాజి దంపతులు పాల్గొని ప్రత్యేక పూజలను నిర్వహించారు. వీరిని ఆలయ మర్యాదలతో స్వాగతించి శాలువలు కప్పి సత్కరించిన వేద పండితులు ఆశీర్వాదం అందించారు. ఆలయం వద్ద మధ్యాహ్నం అన్నదానం చేశారు. దీనికి చైర్ పర్సన్ దంపతులు ఉభయదాతలుగా వ్యవహరించారు.

వైద్య శిబిరానికి విశేష స్పందన



మహిళలకు పోషకాహారం అందిస్తున్న వైద్యురాలు పద్మావతి

చిట్టమూరు: మండల పరిధిలోని ఆరూరు గ్రామంలో సోమవారం నిర్వహించిన ఉచిత వైద్య శిబిరానికి విశేష స్పందన లభించింది. పీహెచ్‌సీ వైద్యాధికారి పద్మావతి వైద్య పరీక్షలు నిర్వహించి మందులు పంపిణీ చేశారు. మహిళలు తీసుకోవల్సిన పోషకాహారంపై అంగన్‌వాడీ సూపర్‌వైజర్ తెలియజేశారు. మహిళలకు పోషకాహారం పంపిణీ చేశారు. మహిళలు తరచూ వైద్య పరీక్షలు చేయించుకుని ఆరోగ్యంగా ఉండాలని సూచించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్‌ఓ బాబూరావు, సచివాలయ సిబ్బంది, వైద్య సిబ్బంది, అంగన్‌వాడీ కార్యకర్తలు సుమతి, సుజాత పాల్గొన్నారు.

వీహెచ్‌పీ ప్రఖండ నూతన కమిటీ

వెంకటగిరి రూరల్ : పట్టణంలోని కర్ణకమ్మవీధిలోని శంకర్‌మఠంలో విశ్వహిందూ పరిషత్ వెంకటగిరి ప్రఖండ నూతన కమిటీని సోమవారం ఎన్నుకున్నారు. నూతన కమిటీ అధ్యక్షులుగా ఎస్ వెంకటశర్మ, ఉపాధ్యక్షులుగా అద్దంకి హేమాద్రీ, కార్యదర్శిగా అలిమిలి మల్లికార్జున్, కోశాధ్యక్షులు కలపాటి హనుమంత్‌ను ఎన్నుకున్నారు.

రోగులకు తప్పని ఇక్కట్లు

ఓజిలి/దీవీ సత్రం: మండలాల్లోని ప్రాథమిక ఆరోగ్యకేంద్రాల్లో సోమవారం నుంచి వైద్యులు సమ్మెలో పాల్గొన్నారు. దీంతో పీహెచ్‌సీలలో రోగులు వైద్యులు కోసం నిరీక్షించాల్సి వచ్చింది. గ్రామీణ ప్రాంతాల్లోని ఆరోగ్య కేంద్రాల్లో నిత్యం సుమారుగా 50 నుంచి 80 మంది రోగులు వివిధ అనారోగ్య సమస్యలతో వస్తుంటారు. అదే విధంగా వైద్యం కోసం వచ్చిన రోగులకు ఆరోగ్య కేంద్రంలో స్టాఫ్ నర్సు, సిబ్బంది సూది వేసి మాత్రలు ఇచ్చి పంపుతున్నారు. రోగులకు సరైన వైద్యం అందకపోవడంతో అసహనం వ్యక్తం చేస్తున్నారు.

జీఎస్టీ సూపర్ సేవింగ్స్‌పై ర్యాలీ



ర్యాలీ చేస్తున్న వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, వ్యాపారులు

గూడూరురూరల్ : ప్రజలకు లబ్ధి చేకూరేలా ప్రభుత్వం అనేక వస్తువులపై తగ్గించిన జీఎస్టీపై ప్రజలకు అవగాహన కల్పిస్తున్నట్లు వాణిజ్య పన్నుల శాఖ తిరుపతి రీజనల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ అడిషనల్ కమిషనర్ నాగేంద్ర తెలిపారు. పట్టణంలో సోమవారం సాయంత్రం టవర్‌క్లాక్ సెంటర్ నుంచి పురవీధుల్లో వాణిజ్య పన్నుల శాఖ అధికారులు, వ్యాపారులతో కలసి సూపర్ జీఎస్టీ సూపర్ సేవింగ్స్ అవగాహన ర్యాలీ నిర్వహించారు.

మున్సిపల్ కార్మికులపై దాడులు ఆపాలి



నిరసన తెలుపుతున్న సీఐటీయూ నాయకులు, మున్సిపల్ కార్మికులు

గూడూరురూరల్ : రాష్ట్రంలో మున్సిపల్ కార్మికులపై దాడులు ఆపాలని సీఐటీయూ నాయకులు డిమాండ్ చేశారు. ఇటీవల గుంటూరు నగరంలో మున్సిపల్ కార్మికులపై జరిగిన దాడులను నిరసిస్తూ రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఏపీ మున్సిపల్ వర్కర్స్ అండ్ ఎంప్లాయీస్ ఫెడరేషన్(సి.ఐ.టి.యు) ఆధ్వర్యంలో సోమవారం గూడూరు పురపాలక సంఘం కార్యాలయం వద్ద నిరసన తెలిపారు. పారిశుధ్య కార్మికురాలిపై జనసేన కార్పొరేటర్ దాడి చేసి నీచంగా మాట్లాడటం దారుణమన్నారు.

చికెన్ ధరలు		30-09-2025
నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్ ధరలు		
బ్రాయిలర్ లైవ్	:	123
లేయర్ లైవ్	:	110
బ్రాయిలర్ చికెన్	:	224
బ్రాయిలర్ స్కిన్ లెస్	:	246
లేయర్ చికెన్	:	187

డిజిటల్ బుక్‌తో శ్రీరామ రక్ష

- వైఎస్సార్‌సీపీ శ్రేణులు వినియోగించుకోవాలి
- డిజిటల్ బుక్‌ను ఆవిష్కరించిన నేదురుమల్లి, మేరిగ, కిలివేటి







వెంకటగిరి: డిజిటల్ బుక్ కరపత్రాలను ఆవిష్కరిస్తున్న నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి, చిల్లకూరు: డిజిటల్ బుక్ స్కానర్‌ను ఆవిష్కరిస్తున్న ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్, నాయుడుపేట: వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్‌ను ఆవిష్కరిస్తున్న కిలివేటి సంజీవయ్య

వెంకటగిరి(సైదాపురం): వైఎస్సార్ సీపీ కార్యకర్తలకు ఎక్కడా ఏ అన్యాయం జరిగినా వెంటనే డిజిటల్ బుక్‌లో లాగిన్ అయి వివరాలు నమోదు చేస్తే పార్టీ అండగా ఉంటుందని వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రామ్‌కుమార్‌రెడ్డి భరోసా ఇచ్చారు. వెంకటగిరి పట్టణంలోని నేదురుమల్లి నివాసంలోని ఎన్‌జేఆర్ భవనంలో సోమవారం డిజిటల్ బుక్ క్యూఆర్‌కోడ్‌ను పార్టీ ముఖ్య నేతలతో కలసి నేదురుమల్లి ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ వేధింపులు, ఇబ్బందులు ఎదురైతే డిజిటల్ బుక్‌లో ఫోన్ నంబర్లు, ఇతర వివరాలను పొందుపరచాలని కోరారు. ఇటీవల తాడేపల్లిలో జరిగిన సమావేశంలో అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌ని ప్రవేశ పెట్టారని చెప్పారు. ఈ బుక్‌ను అన్ని నియోజకవర్గాల్లో, మండలాలు, గ్రామాల్లో విడుదల చేసి పార్టీ నాయకులు, కార్యకర్తలకు అండగా నిలవాలని సూచించారు. ఇప్పటికే చాలా మంది పార్టీ సానుభూతిపరులు, కార్యకర్తలకు తీవ్ర అన్యాయం జరిగిందని, వాటిపై న్యాయస్థానాల్లో పోరాటాలు చేస్తూ ఉన్నామన్నారు. ప్రజలకు , వైఎస్సార్ కాంగ్రెస్‌పార్టీ కార్యకర్తలకు ఎక్కడా ఏ అన్యాయం జరిగినా సులువుగా సమాచారం తెలుసుకునేందుకు డిజిటల్ బుక్‌ను పెట్టామని స్పష్టం చేశారు. అక్రమంగా పెట్టిన ప్రతి కేసుకు ఈ డిజిటల్ బుక్ సమాధానంగా ఉంటుందని, చర్యకు, ప్రతి చర్య అనేది తమ నాయకుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి డిజిటల్ బుక్‌లో పొందుపరిచారన్నారు. వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీలో ప్రతి కార్యకర్తకు తగిన గుర్తింపు ఉంటుదనేదానికి ఈ డిజిటల్ బుక్ ఒక నిదర్శనమన్నారు. కూటమి నాయకులతోపాటు కొందరు అధికారులు కూడా వైఎస్సార్ సీపీ నాయకులను ఇబ్బందులకు గురిచేస్తున్నారని, తాము అధికారంలోకి వచ్చిన తర్వాత చట్టపరమైన వారిపై కచ్చితంగా చర్యలు తీసుకుంటామని మరోసారి హెచ్చరించారు. కూటమి ప్రభుత్వ విధానాలపై ఎవరైనా గొంతెత్తి మాట్లాడితే వారి గొంతు నొక్కేస్తోందని విమర్శించారు. ఎవరైతే మాట్లాడితే వారిపై అక్రమ కేసులు పెట్టి కక్షసాధింపు చర్యలకు పాల్పడుతుందన్నారు. కూటమి ప్రభుత్వంలో జరిగిన అన్యాయాలను తెలుపుతూ యాప్ డౌన్‌లోడ్ చేసుకోని వీడియోలు, ఫోటోలు అప్‌లోడ్ చేయవచ్చన్నారు. యాప్‌లో వివరాలు నమోదు చేయలేని వారు 040-49171718 నెంబర్‌కు కాల్ చేసి ఫిర్యాదు చేసే అవకాశం ఉందని చెప్పారు. అనంతరం యాప్‌లో వివరాలు ఎలా నమోదు చేయాలో వీడియో రూపంలో అవగాహన కల్పించి అధినేత వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సందేశం వినిపించారు. ఈ కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ పట్టణ కన్వీనర్ పులి ప్రసాద్‌రెడ్డి, బాలాయపల్లి, డక్కిలి, రాపూరు, సైదాపురం మండల కన్వీనర్లు వెందోటి కార్తీక్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, మధుసూదన్‌రెడ్డి, మన్నారపు రవి కుమార్‌యాదవ్, కలువాయి జెడ్పీటీసీ సభ్యులు అనీల్‌కుమార్‌రెడ్డి, పద్మశాలి కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ నక్కా వెంకటేశ్వరరావు, అనుబంధ వైఎస్సార్ సీపీ విభాగాల అధ్యక్షులు సదారెడ్డి, ఎం వెంకటేశ్వర్లు, ఎంఏ నారాయణ, ఆరి శంకరయ్య, బట్టేపాటి దయాకర్‌రెడ్డి, కంభం విజయభాస్కర్ రెడ్డి, కమళ్లపూడి సుబ్బారెడ్డి, నారాయణరెడ్డి, మున్సిపల్ కౌన్సిలర్లు, వైఎస్సార్‌సీపీ శ్రేణులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

కార్యకర్తలకు అండగా డిజిటల్ బుక్

నాయుడుపేట టౌన్: కూటమి నేతల అరాచకాలకు గురవుతున్న వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ శ్రేణులకు అండగా నిలిచేందుకు పార్టీ అధినేత వైఎస్ జగన్ ఈ డిజిటల్ బుక్ తీసుకొచ్చారని సూళ్లూరుపేట మాజీ ఎమ్మెల్యే కిలివేటి సంజీవయ్య తెలిపారు. పట్టణంలోని ఆ పార్టీ క్యాంపు కార్యాలయంలో సోమవారం సాయంత్రం సంజీవయ్యతోపాటు వైఎస్సార్ సీపీ రాష్ట్ర కార్యదర్శి కామిరెడ్డి సత్యనారాయణ రెడ్డి, జిల్లా ఉపాధ్యక్షులు తంబిరెడ్డి సుబ్రహ్మణ్యం రెడ్డి, జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి కామిరెడ్డి రాజారెడ్డి తదితర నాయకులతో కలిసి వైఎస్సార్‌సీపీ డిజిటల్ బుక్ పోస్టర్‌ను ఆవిష్కరించారు. కార్యక్రమంలో మున్సిపల్ చైర్ పర్సన్ కటకం దీపిక, వైస్ చైర్మన్ వెంకట కృష్ణారెడ్డి, ఎంపీపీ కురుగొండ ధనలక్ష్మి, పెళ్లకూరు జెడ్పీటీసీ ప్రిస్కిల్లా, పార్టీ పట్టణ, మండల అధ్యక్షులు కలికి మాధవ రెడ్డి, ఒట్టూరు కిషోర్‌యాదవ్, ఓజిలి, దొరవారిసత్రం, మండల కన్వీనర్లు పాదర్తి హరినాథ్‌రెడ్డి, రాహుల్‌రెడ్డి పాల్గొన్నారు.

పార్టీ శ్రేణులకు అండగా ..

చిల్లకూరు : కూటమి ప్రభుత్వం ఏర్పడిన తరువాత వైఎస్సార్‌సీపీ కార్యకర్తలపై అక్రమ కేసులు దాడులు, అరెస్టులు పరిపాటిగా చేపడుతున్న క్రమంలో కార్యకర్తలకు భరోసా ఇచ్చేలా పార్టీ అధినేత వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి నూతన విధానంలో ప్రతి ఒక్కరి చేతుల్లో ఉండేలా డిజిటల్ బుక్‌ను తీసుకువచ్చారని గూడూరు నియోజకవర్గ సమన్వయకర్త, ఎమ్మెల్సీ మేరిగ మురళీధర్ తెలిపారు. గూడూరులోని వైఎస్సార్‌సీపీ కార్యాలయంలో సోమవారం పార్టీ అమలు చేసే డిజటల్ బుక్ స్కానర్‌ను ఆవిష్కరించారు. ఆయన మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారం చేపట్టిన తరువాత గ్రామీణ ప్రాంతాల్లో వైఎస్సార్‌సీపీ కార్యకర్తలు, అభిమానులు, సోషల్‌మీడియా ప్రతినిధులు ఇలా ప్రతి ఒక్కరినీ ఇబ్బందులకు గురిచేస్తున్నారన్నారు. దీనిని నివారించేందుకు అధినేత జగన్‌మోహన్‌రెడ్డి భరోసా ఇస్తూ డిజిటల్ బుక్‌ను విడుదల చేశారని అన్నారు. ఫోన్ నంబర్లు అందుబాటులో ఉంచినట్లు తెలిపారు. ప్రతి ఒక్కరి ఫోన్‌లో డిజిటల్ బుక్ స్కానర్ ఉండేలా చూడాలని పిలుపు నిచ్చారు. ఈ కార్యక్రమంలో గూడూరు పట్టణ, రూరల్, కోట మండలాల పార్టీ కన్వీనర్లు బొమ్మిడి శ్రీనివాసులు, మలుల విజయకుమార్ రెడ్డి, పలగాటి సపంత్‌కుమార్‌రెడ్డి పాల్గొన్నారు.

మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా కృషి

గూడూరురూరల్ : సమాజంలో మానవ హక్కుల పరిరక్షణే ధ్యేయంగా అన్ని శాఖల అధికారులు పని చేయాలని తహసీల్దార్ ఆర్.వి.ప్రసాద్ అన్నారు. మండలంలోని పాలిచెర్లరాజుపాళెం గ్రామంలో ఉన్న ఎస్టీ కాలనీలో సోమవారం పౌర హక్కుల దినోత్సవం నిర్వహించారు. తహసీల్దార్ మాట్లాడుతూ ప్రతి నెలా 30న మండలంలోని ఎస్సీ, ఎస్టీ కాలనీల్లో మానవ హక్కుల పరిరక్షణపై అవగాహన కల్పించారు.

చిల్లకూరు: ఎస్టీ, ఎస్సీలకు రాజ్యాంగం కల్పించిన హక్కులు, చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని తహసీల్దార్ శ్రీనివాసులు సూచించారు. మండలంలోని కలవకొండ గ్రామ పంచాయతీ బెస్తపాళెంలో సోమవారం సివిల్ రైట్స్ డేను నిర్వహించారు.

కలువాయి(సైదాపురం): కలువాయి మండలంలోని బద్దవోలు గ్రామంలో సోమవారం పౌర హక్కుల దినోత్సవం సందర్భంగా మండల స్థాయి అధికారులు ఎస్సీ, ఎస్టీలకు అవగాహన కల్పించారు.

కౌన్సిలర్‌కు సర్వజ్ఞ పరామర్శ



శ్రీనివాసులును పరామర్శిస్తున్న సర్వజ్ఞకుమార యాచేంద్ర, కలిమిలి

వెంకటగిరి రూరల్: పట్టణంలోని 23వ వార్డు ఆటంబాకం శ్రీనివాసులు అనారోగ్యంతో బాధపడుతుండగా వెంకటగిరి రాజా కుటుంబీకులు సర్వజ్ఞకుమార యాచేంద్ర, వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు కలిమిలి రాంప్రసాద్‌రెడ్డి సోమవారం ఆటంబాకం శ్రీనివాసుల నివాసం వద్దకు చేరుకుని ఆరోగ్యస్థితి గతులను అడిగి తెలుసుకున్నారు. అనంతరం వైఎస్సార్‌సీపీ నాయకులు తాండవ రాజారెడ్డి కుమారుడు తాండవ మునిసాయిరెడ్డి నిశ్చితార్థం సందర్భంగా వారి నివాసానికి వెళ్లి ఆశీర్వదించారు.

రైల్వే గేటు సమస్యపై ఎంపీకి వినతి



ఎంపీకి వినతి పత్రం అందిస్తున్న మండల నాయకులు

తడ: మండలంలోని బీములవారి పాళెం వద్ద ఉన్న రైల్వే గేటు వల్ల తరచూ తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నట్లు గేటు వద్ద అండర్ పాస్ బ్రిడ్జి నిర్మించేలా చర్యలు తీసుకోవాలని స్థానికులు తిరుపతి పార్లమెంటు సభ్యులు మద్దిల గురుమూర్తికి సోమవారం విన్నవించారు. తడ వైస్ ఎంపీపీ చిన్నప్పన్ రమేష్, వైఎస్సార్‌సీపీ మండల ఉపాధ్యక్షులు ముళవాయల్ రమేష్‌రెడ్డి, పార్టీ హస్త కళల విభాగం అధ్యక్షులు వినోద్ తిరుపతిలోని ఎంపీ కార్యాలయానికి వెళ్లి, వినతి పత్రం అందించారు. స్పందించిన ఎంపీ గురుమూర్తి వెంటనే రైల్వే చెన్నై డీజీఎంకి ఫోన్ చేసి పరిస్థితిని వివరించారు. సాధ్యమైనంత త్వరగా అండర్ బ్రిడ్జి నిర్మాణం జరిగేలా చర్యలు తీసుకోవాలని కోరారు.

భూకబ్జాపై గ్రీవెన్స్‌లో ఫిర్యాదు



తహసీల్దార్ హరికృష్ణకు భూకబ్జాపై ఫిర్యాదు చేస్తున్న బాధితులు

పెళ్లకూరు: మండలంలోని పునబాక గ్రామంలో ఉన్న తమ భూములను స్థానికేతరులు కబ్జా చేశారని బాధితులు సోమవారం స్థానిక రెవెన్యూ కార్యాలయంలో జరిగిన గ్రీవెన్స్‌డేలో స్థానిక తహసీల్దార్ హరికృష్ణను కలిసి ఫిర్యాదు చేశారు. బాధితుల కథనం మేరకు గ్రామంలోని సర్వే నంబరు 500–8లో 90సెంట్లు, సర్వే నంబరు 500–9లో మరో 90 సెంట్లు మొత్తం 1.8 ఎకరాలు ప్రభుత్వ భూమిని అదే గ్రామానికి చెందిన నిరుపేదలైన డేగా చెంగమ్మ, అట్ల బాలమ్మకు 25 ఏళ్ల కిందట ప్రభుత్వం మంజూరు చేసింది. దీనికి సంబంధించి పట్టాదారు పాసుపుస్తకాలు కూడా అందజేశారు. అయితే సింగమాల గ్రామానికి చెందిన స్థానికేతరులు తొట్టంబేడు ధనలక్ష్మి సంబంధిత భూమిని కబ్జా చేసి జామాయిల్ సాగు చేస్తున్నట్లు ఫిర్యాదులో పేర్కొన్నారు. ఈ విషయమై పూర్తి స్థాయిలో పరిశీలించి బాధితులకు న్యాయం జరిగేలా చర్యలు తీసుకుంటామని తహసీల్దార్ సూచించారు. వీరి వెంట వీఆర్వో సుధాకర్ ఉన్నారు.

గైర్హాజరైతే కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తా



మాట్లాడుతున్న ఎంపీడీఓ రవీంద్రబాబు

డక్కిలి: మండల సమావేశానికి అధికారులు ఏ ఒక్కరైనా గైర్హాజరైతే జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేస్తామని ఎంపీడీఓ రవీంద్రబాబు తెలిపారు. స్థానిక మండల కార్యాలయంలో సోమవారం సర్వసభ్య సమావేశం ఎంపీపీ గోను రాజశేఖర్ అధ్యక్షతన నిర్వహించారు. దీనికి పలువురు అధికారులు గైర్హాజరుకావడంతో ఎంపీడీఓ ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇకపై జరగబోయే సమావేశాలకు రాలేని పక్షంలో అధికారులు తప్పనిసరిగా ఎంపీపీ లేదా ఎంపీడీఓల అనుమతి తీసుకోవాలని చెప్పారు. ఎంపీపీ గోను రాజశేఖర్ మాట్లాడుతూ రైతులకు కావాల్సిన విత్తనాలు, ఎరువులు అందుబాటులో ఉండేలా వ్యవసాయశాఖ అధికారులు చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల అనారోగ్యం కారణంగా మృతి చెందిన వైఎస్సార్‌సీపీ జెడ్పీటీసీ సభ్యురాలు కలిమిలి రాజేశ్వరి, డీ వడ్డిపల్లి సర్పంచ్ వేపమాను చెంచమ్మను స్మరించుకుంటూ మౌనం పాటించారు. అనంతరం ఇటీవల సొసైటీ అధ్యక్షులుగా నూతనంగా ఎన్నికైన వారిని ఎంపీటీసీ సభ్యులు, అధికారులు, సర్పంచ్‌లు సన్మానించారు.

పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం

డక్కిలి: పోషకాహారంతో సంపూర్ణ ఆరోగ్యం లభిస్తుందని ఏసీడీపీఓ క్రిష్ణ మంజరి తెలిపారు. స్థానిక ఐకేపీ కార్యాలయంలో సోమవారం అంగన్‌వాడీ కార్యకర్తలకు పోషణ్ మాస కార్యక్రమం నిర్వహించారు. వివిధ రకాల కూరగాయలు, పండ్లు, కోడిగుడ్లు, బాలామృతం తదితర పోషకాహార పదార్థాలను ప్రదర్శించారు.

నీటి సమస్యను పరిష్కరించండి

కోట: మండలంలోని విద్యానగర్ ప్రకాశం కాలనీలో నీటి సమస్యను పరిష్కరించాలని ఆ కాలనీవాసులు సోమవారం ఎంపీడీఓ దిలీప్‌కుమార్‌కు వినతిపత్రం అందజేశారు. గత కొద్దిరోజులుగా కొళాయిల్లో నీరు రావడం లేదన్నారు. విద్యుత్ సమస్య కారణంగా మంచీనీటి పథకానికి సంబంధించిన మోటార్లు పనిచేయడం లేదని, సమస్యను పరిష్కరిస్తామని ఎంపీడీఓ వారికి హామీ ఇచ్చారు.

దారికోసం సర్వే

కలువాయి(సైదాపురం): మండలంలోని వెంకటరెడ్డిపల్లి గ్రామస్తులు పొలాలకు వెళ్లేందుకు దారి లేదని నెల్లూరు కలెక్టరేట్ లో ఈ నెల 22న జిల్లా కలెక్టర్ హిమాంశు శుక్లకు ఫిర్యాదు చేశారు. కలెక్టర్ ఆదేశాల మేరకు నేషనల్ హైవే అధికారి రాజేష్, కుల్లూరు సచివాలయం -2 విలేజ్ సర్వేయర్ నవీన్, ఫిర్యాదు దారులతో కలసి సర్వే చేపట్టారు.

సమస్యలు పరిష్కరించాలని వినతి



ఎంపీడీఓకు వినతి పత్రం సమర్పిస్తున్న సచివాలయ అధికారులు

వెంకటగిరి రూరల్: తాము ఎదుర్కొంటున్న సమస్యలను సకాలంలో పరిష్కరించి తమకు రావాల్సిన అన్ని ప్రమోషన్లను ఇవ్వాలని గ్రామ, వార్డు సచివాలయాల ఉద్యోగులు డిమాండ్ చేశారు. పట్టణంలోని మండల పరిషత్ కార్యాలయంలో సోమవారం ఎంపీడీఓ సచివాలయం అధికారులు వినతి పత్రం సమర్పించారు. వారు మాట్లాడుతూ తమకు రావాల్సిన డీఏలు, ఇతర అన్ని అలవెన్సులు అమలు చేయాలని కోరు. సచివాలయం అధికారుల హక్కుల సాధన కోసం రాష్ట్ర వ్యాప్తంగా పోరాటాలు చేస్తున్నట్లు తెలిపారు. తమ సమస్యలను పరిష్కరించాలని లేని పక్షంలో వాట్సప్ గ్రూప్ నుంచి లెఫ్ట్ అవుతామని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సచివాలయం అధికారులు పాల్గొన్నారు.

విద్యుత్ షాక్‌తో యువకుడికి తీవ్రగాయాలు



గాయపడిన సంతోష్

సైదాపురం: పెయింట్ వేస్తుండగా విద్యుత్‌తీగలు తగిలి ఓయువకుడు తీవ్రంగా గాయపడిన ఘటన మండలంలోని కొమ్మిపాడు గ్రామంలో సోమవారం చోటు చేసుకుంది. స్థానికుల కథనం మేరకు, గ్రామంలో కూటమి నేత నిర్మించిన (ఫ్యామిలీ దాబా) భవనానికి పెయింటింగ్ వేసేందుకు రాపూరు గ్రామానికి చెందిన సంతోష్(25) వచ్చాడు. పెయింటింగ్ పనులు చేస్తుండగా విద్యుత్ లైన్ తీగలు తగిలి షాక్‌తో కిందపడిపోయారు. అక్కడే పనిచేస్తున్న కార్మికులు గాయపడిన సంతోష్‌ను గూడూరు ఏరియా ఆస్పత్రికి, అక్కడి నుంచి నెల్లూరు ఆస్పత్రికి తరలించారు. అయితే ఈ విషయమై ఎలాంటి ఫిర్యాదు అందలేదని పోలీసులు తెలిపారు.

‘నమస్తే’పై అవగాహన కల్పించాలి

వెంకటగిరి రూరల్ : చెత్తను సేకరించి జీవనం సాగించే వారికి నమస్తే కార్యక్రమంపై అవగాహన కల్పించాలని మున్సిపల్ కమిషనర్ వెంకటరామిరెడ్డి తెలిపారు. పట్టణంలోని మున్సిపల్ కార్యాలయంలో సోమవారం నమస్తే వేస్ట్ పిక్కర్ కంపోస్ట్ పథకాన్ని ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ చెత్త ఏరుకునే వారు, చిక్కు వెంట్రుకలు సేకరించుకునేవారు, ఎంఆర్ఎఫ్ కూలీలు, ఆర్ఆర్ ఆర్ సెంటర్లో పనిచేసే వారు నమస్తే కార్యక్రమానికి అర్హులన్నారు. వీరికి ఐడి కార్డులు ఇచ్చి, రూ. ఐదు లక్షల ఆరోగ్యబీమా, పిల్లలకు స్కాలర్‌షిప్‌లు, పింఛన్, బ్యాంకు రుణాలు పంపిణీ చేయనున్నట్లు తెలిపారు.

జాయింట్ సర్వే చేయాలని నిరసన

బాలాయపల్లి(సైదాపురం): అటవీ, రెవెన్యూశాఖ అధికారులు జాయింట్ సర్వే నిర్వహించాలని మండలంలోని గొట్టికాడు గ్రామ దళితులు సోమవారం ఉన్న తహసీల్దార్ కార్యాలయం వద్ద నిరసన వ్యక్తం చేశారు. దళితులు మాట్లాడుతూ 20 ఏళ్ల క్రితం సర్వే నెంబర్-1లో ఉన్న ప్రభుత్వ భూమిను చదును చేసుకుని సాగుకు అనుకూలంగా మార్చుకుని పంటలు పండించుకుంటున్నామని చెప్పారు. అటవీశాఖ అధికారులు ఈ పొలంలో అటవీశాఖకు సంబంధించి భూములకు వస్తే కేసులు పెడతామని బెదిరిస్తున్నట్లు తెలిపారు. రెవెన్యూ అధికారులు వెంటనే జాయింట్ సర్వే నిర్వహించి తాము సాగు చేసుకుంటున్న భూములకు శాశ్వత హక్కు కల్పించేలా ప్రత్యేక చర్యలు చేపట్టాలని కోరారు. అనంతరం తహసీల్దార్‌కి వినతి పత్రం సమర్పించారు.







చిట్టమూరు: సరస్వతిదేవిగా కామాక్షమ్మ, నాయుడుపేట : వీణాపాణిగా మూకాంబికా దేవి, సూళ్లూరుపేట: సరస్వతిగా చెంగాళమ్మ

సరస్వతీ దేవి కటాక్షం



రాపూరు : విద్యాలక్ష్మిగా ఆదిలక్ష్మిదేవి

గూడూరు, సూళ్లూరుపేట, వెంకటగిరి నియోజకవర్గాల్లో దేవీ శరన్నవరాత్రి ఉత్సవాలు కనుల పండువగా సాగుతున్నాయి. అందులో భాగంగా అమ్మవార్లు వివిధ రకాల వేషధారణల్లో భక్తులను కటాక్షించారు. భక్తులు అధిక సంఖ్యలో విశేష అలంకరణలో ఉన్న అమ్మవారిని దర్శించుకున్నారు.

– సాక్షి నెట్‌వర్క్



గూడూరు : సరస్వతిదేవిగా శ్రీవిజయదుర్గమ్మ



వెంకటగిరి : సరస్వతి దేవిగా కాత్యాయమని అమ్మవారు